# లయతప్పిన జీవితాలు

రచన : శ్రీ ఎ. ఎం. అయోధ్యారెడ్డి.

సాయంకాలమయింది. పగలంతా ప్రపంచాన్ని చుట్టి వచ్చిన సూర్యభగవానుడు నీరసంగా పశ్చిమాద్రిన విశ్రమిస్తున్నాడు.

బీచ్ అత్యంత కోలాహలంగా వుంది. పిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా ఆ సమయాన అందమైన సముద్ర విన్యాసాన్ని తిలకిస్తూ తన్మయత్వంలో మునిగి తేలుతున్నారు.

నిర్విరామంగా, వెనుదిరిగి చూడకుండా పయనిస్తూ శత్రు సైన్యంతో ఢీకొని తారసిల్లె యుద్ధ సైనికుల్లా కెరటాలు తీరాన్ని స్పృశిస్తూ విరిగి పడుతున్నాయ్.

అటువంటి చోట కాస్త ఏకాంతంగా, నీటికి చేరువలో ఇరువురు వ్యక్తులు కూర్చుని వున్నారు. ఒకరు పద్మ, మరొకరు సుధాకర్.

సుధాకర్ వదనంలో ఎందుకో విషాద మేఘాలు ఆవరించుకొని వున్నాయ్. కళ్లు ఎఱ్ఱబడి ముఖమంతా నీరసంగా వుంది. అతనెందుకో అంతరంగంలో విపరీతంగా మదన పడుతున్నాడనడానికి వుండి వుండి విసుస్తున్న అతడి నిట్టూర్పులే తార్కాణం.

"సుధా!" అంతక్రితం వరకు అతడి మోహం వంకే పరిశీలనగా చూస్తున్న పద్మ వెళ్ళి సుధాకర్ ప్రక్కన ఆసీనురాలై, అతని చేతిని తన చేతిలోకి తీసికొంది. అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది.

"ఎందుకలా వున్నావు సుధా ఈ రోజు? నాతో చెప్పవూ?"

పద్మ చేతిలోంచి తన చేయి మెల్లగా విడిపించుకొని ఇసుకలో వెల్లకిలా పడుకున్నాడు సుధాకర్.

పైన ఆకాశం మనస్సుకు ఉల్లాసం కల్గించేలా వుంది. అక్కడక్కడ తెల్లని దూదిపింజల్లాంటి మేఘాలు ఆకాశపు నీలి వస్త్రంలో మాసికల్లా ఉన్నాయ్. గగనాన్ని తాకుతుందేమో అన్నంతగా చాలా ఎత్తున పక్షి ఒకటి విలాసంగా ఎగురుతూంది.

సుధాకర్ ఒక్క క్షణం భారంగా కనురెప్పలు మూశాడు. మరుక్షణంలో తెరచి నిస్పృహగా నవ్వాడు "పద్మా!" మెల్లగా, విషాదం ధ్వనిస్తున్న కంఠంతో అన్నాడు "ప్రపంచంలో నా అంతటి అభాగ్యుడూ, దురదృష్టవంతుడూ వున్నాడంటావా?"

అతని కంఠస్వరంలోని దైన్యానికి దిగ్భ్రమ చెందిన పద్మ విచిత్రంగా అతనివైపు చూసింది.

"ఆశ్చర్యపోతున్నావు కదూ! నేనన్నది అక్షరాలా నిజం. ఈ లోకంలో నేనొక ఏకాకిని. ఆప్యాయతా, అనురాగాలు కరువైన అదృష్టహీనుడిని. నా బ్రతుకు నాకే అర్థంగాని సమస్య అయింది."

"ప్లీజ్ సుధా! అంత విరక్తిగా మాట్లాడకు. నీ అంతరంగంలో వేధిస్తున్న సమస్య ఏమిటో అర్థం కావడం లేదు నాకు. నువ్విలా కృంగిపోతుంటే నేను చూడలేను. దయచేసి అదేమిటో నాతో చెప్పు" ఆమె అతని దగ్గరగా జరుగుతూ ఆర్తిగా అంది.

"నీకు తెలియదు పద్మా! నా గుండెలో ఎన్ని అగ్నిగుండాలు ప్రజ్వరిల్లుతున్నాయో నీకు తెలియదు. నా గతాన్ని తవ్వి నీకు విన్పించె మనోధారుఢ్యం నాలో లేదు. అలా తవ్వుకున్నా మిగిలేది ఆవేదనే. ఇక నేను కృంగిపోవడమంటావా? దాన్నెవ్వరూ ఆపలేరు."

పద్మ ఒక్క నిముషం సుధాకర్ కళ్ళలోకి నిశితంగా చూసింది. ఆ కళ్ళలో పరుగు లెత్తుతున్న భావాలను చదవ సాధ్యంగాక "అలా అనకు సుధా! కష్టమైనా సుఖమైనా ఒకరితో చెప్పుకుంటేనే మనిషికి ఉపశమనం దొరికేది. ఒక స్నేహితురాలిగా నాకు చెప్పకూడదా!" అంది మార్దవంగా.

అతడు ఏమీ వ్యాఖ్యానించలేదు. రెండు మూడు నిమిషాలు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా వుండిపోయాడు. కడకతను లేచి పద్మకభిముఖంగా కూర్చుని ఆవేశ వుద్వేగాలతో చెప్పసాగాడు.

"చూడు పద్మా! చిన్నప్పట్నించీ నేనొంటరిగానే పెరిగాను. ఎన్నో కష్టాలతో పోరాడి ఎదిగాను. నా అనుకునే తల్లిని ఎరుగను. తండ్రి వున్నా లేనట్టుగానే పెరిగాను. చాలా రకాల మనుషులతో తిరిగాను. మనుషుల్లోని దుర్మార్గాణ్ని, క్రౌర్యాణ్ని, స్వార్థాన్ని, అవినీతిని చాలా దగ్గరగా చూశాను. అనేక వంచనలకు గురయ్యాను. నిజాయితీ కోసం, నిజమైన స్నేహం కోసం అలమటించి, ప్రయత్నించి వాటి నిజమైన స్వరూపాన్ని పొందాలని నిప్పులో వేసిన తాటాకులా దహించాను.

"కాస్త పెద్దయింతర్వాత నా దశ కొంచెం మారింది. హైస్కూల్లోనూ, కాలేజీలోనూ చదువుతూ వుండగా నేనంటే ఇష్టపడే కొంతమంది సహచరులు ఏర్పడ్డారు. కాని వాళ్లలో ఎవ్వరూ స్వచ్ఛమైన స్నేహితాన్ని, స్నేహితంలోని అమరత్వాన్ని పంచి యిచ్చేవారుగా అగుపించలేదు నాకు.

అటువంటి సమయంలో నా హృదయానికి అతి దగ్గరగా వచ్చిన ఒకానొక స్నేహశీలి శారద. శారద నాతో స్నేహమయ్యాక ఆమెలోని అనురాగం, సౌజన్యం నామీద ప్రసరించడం ప్రారంభించాక నేను యాంత్రికంగా జీవించడం మానుకున్నాను.

స్త్రీ ఎంతటి మృదుమధుర శక్తో. స్త్రీ ఎంతటి ప్రేమ కారుణ్యమూర్తో, స్త్రీ ఎంతటి కమనీయ, దమనీయ సముదాయమో ఆమెతో సన్నిహితం ఏర్పడ్డాక అర్థమయింది నాకు.

'శారద!' ఆమె ఒక తేజోమూర్తి. నా జీవితాన్ని వెలుగుతో నింపిన అమృతమూర్తి. కాలేజీలో చదివినంత కాలం మేమిద్దరం ఒకరికి ఒకరుగా కల్సి మెల్సి వున్నాం. పరీక్షలు పూర్తయింతర్వాత ఆమె సెలవులకు స్వగ్రామం వెళ్ళింది. ఆ తర్వాత నేను చదువు ఆపేసి బిజినెస్‌లో సెటిల్ అయాను.

"ఒకరోజు!"

◆ ◆ ◆

సుధాకర్ ఆఫీసులో కూర్చుని ఏవో కాగితాలు పరిశీలిస్తున్నాడు. ఇంతలో సెక్రటరీ ఆనందరావు ఆ రోజు వచ్చిన కొన్ని ఉత్తరాలు తెచ్చి బల్లమీదుంచాడు.

పైన సీలింగ్ ఫాన్ గిరగిరా తిరుగుతోంది. ఆ గాలి తాకిడికి సుధాకర్ క్రాఫింగ్ కొద్దిగా చెదిరి వెంట్రుకలు నుదురుమీద అందంగా కదలాడుతున్నాయి.

చూస్తున్న కాగితాలు ప్రక్కన వుంచి ఉత్తరాలు పరిశీలించడంలో నిమగ్నమయ్యాడు సుధాకర్. అతను చూడటం పూర్తి చేసిన వాటిల్లో ముఖ్యమైనవి, బిజినెస్‌కు సంబంధించినవి తీసి ఫైల్లో జాగ్రత్త చేస్తున్నాడు ఆనందరావు. ఇంతలో ఒక లెటర్ చేతిలోకి తీసుకొని చూస్తున్న వదనం ఆనందంతో విప్పారింది. గబగబా విప్పి చదివాడు.

డియర్ సుధా!

క్షేమంగా వున్నారని తలుస్తాను. అతి విషమ పరిస్థితిలో నేనీ ఉత్తరం రాస్తున్నాను. పరీక్షలు పూర్తయిన వెంటనే నేను ఇంటికి వచ్చేశాను. ఈ మధ్యన అంటే రెండు రోజుల క్రితం ఇక్కడ ఊహించని అనర్థం జరిగిపోయింది.

మొన్నటి రోజు! పొలం దగ్గర్నుంచి ఇంటికి తిరిగి వస్తూన్న నాన్నగార్ని పాము కాటేసింది. అలాగే నడుస్తూ యింటికివచ్చిన ఆయన పరిస్థితి అధ్వాన్నమైపోయింది. ఎవరు ఎంతగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.

చివరకు సుధా! నన్ను తన ప్రాణంకన్న మిన్నగా చూచుకునే నాన్న నన్ను విడిచి వెళ్ళిపోయాడు. ఈ సంఘటన నన్ను చాలా కృంగదీసింది. చిన్నప్పట్నించీ తల్లిలేని లోటు ఏమాత్రం తెలియనివ్వకుండా పెంచిన నాన్న! బి.ఏ. వరకు రెక్కలు ముక్కలు చేసి నన్ను కష్టపడి చదివించిన నాన్న!! నేను కళ్ళారా చూస్తూండగానే, నా ఎదుటే దివంగతుడయ్యాడు.

నువ్వు తప్ప నాకు నా అన్నవారు, శ్రేయోభిలాషులు ఎవ్వరులేరు సుధా! నాకిక్కడ ఏమిటోగా వుంది. ఒంటరితనం పిచ్చివాణ్ని చేస్తోంది. దయచేసి నన్నిక్కణ్ణించి తీసుకుపో!

ఈ లెటర్ చూడగానే మా ఊరికి తప్పకుండా వస్తావుకదూ!

నిరీక్షిస్తూ
నీ
శారద.

ఉత్తరం చదవడం పూర్తి చేసిన సుధాకర్ వదనం ఒక్కసారిగా మారిపోయింది. భారంగా నిట్టూర్చి చేతిలోని ఉత్తరం టేబుల్ మీద జారవిడిచాడు.

"వాట్ సార్! ఒక్కసారిగా మీరలా అయిపోయారేం?', అతని ముఖంవంకే పరిశీలనగా చూస్తున్న సెక్రటరీ ఆనందరావు ఆతృతగా ప్రశ్నించాడు.

"ఏంలేదు రావ్! నా స్నేహితురాలు ఒకామె తండ్రి హఠాత్తుగా చనిపోయాడు" గంభీరంగా అంటూ కుర్చీలో చేరగిలబడ్డాడు సుధాకర్.

"అలాగా సార్! మరి మీరు వెళతారా? ఇంతకీ ఏ వూరు సార్ వారిది?" బాస్ ముఖంలోకి కాస్త సానుభూతిగా చూస్తూ అడిగాడు.

"అవును రావ్! వెళ్ళాలి. ఆమె ఇప్పుడు ఏకాకి. ప్రపంచంలో నేను తప్ప దగ్గరివాళ్ళెవ్వరూ లేరు".

"అయామ్ రియల్లీ పిటీ సార్! ఆమెకు మీతోపాటు నా సానుభూతి కూడా అందజేయండి!!" ఆనందరావు కంఠస్వరంలో విచారం ద్యోతకమైంది. అతని మనస్సులో "ఎవరా అమ్మాయి? ఆమెకూ, బాస్‌కూ ఏమిటి సంబంధం?" అనే అనుమానం కూడా కలిగింది.

"ఒక్క సానుభూతి మాత్రమే తెలియపర్చడానికి నేనక్కడకు వెళ్ళడంలేదు రావ్! ఆ అమ్మాయి నాతోనే ఇక్కడకు వస్తుంది. ఇకనుంచి ఇక్కడే వుంటుంది" కుర్చీలోంచి లేస్తూ గంభీరంగా అన్నాడు సుధాకర్.

విచిత్రంగా అయనవైపు చూశాడు ఆనందరావు "ఏమిటి సార్! ఆమె ఇకనుంచి ఇక్కడే వుంటుందా!"

"అవును! ఆమె ఇకనుంచి ఇక్కడే అంటే మా ఇంట్లోనే వుంటుంది. ఆమె పేరు శారద" అని చెప్పి సుధాకర్ ఆనంద్ దగ్గరగా నడిచి, అతని భుజంమీద చేయివేసి ఆప్యాయంగా తట్టుతూ, "డియర్ రావ్! నువ్వు నాకు పర్సనల్ సెక్రటరీ మాత్రమే కాదు, ప్రియ స్నేహితుడివి కూడా. శారదవాళ్ళ ఊరికి నువ్వూ రావాలో! దారిలో అన్ని విషయాలు చెబుతాను" అన్నాడు.

"అలాగే సార్!" ఆనందరావు కళ్ళలో తనపై యజమాని కురిపిస్తున్న ఆప్యాయతా అనురాగాలకు కృతజ్ఞత కదలాడింది.

"అయితే రంగాను కారు సిద్ధం చేయమని చెప్పు. నేను పది నిముషాల్లో వస్తాను రెడీయై!" అని బయటకు నడిచాడు సుధాకర్.

ఆయన వెనకే అనుసరించాడు ఆనందరావు.

"మీరామెను పెళ్ళి చేసుకుంటారా సార్!" అమితాశ్చర్యంతో ప్రశ్నించాడు ఆనందరావు.

కారు వేగంగా వరంగల్‌కు ఇరవై కిలోమీటర్ల దూరంలోనున్న శారద వాళ్ళ గ్రామంవైపు ప్రయాణం చేస్తోంది. బాక్ సీట్లో సుధాకర్, ఆనందరావులు ఆసీనులై వున్నారు.

డ్రైవర్ రంగా ఏకాగ్రతగా కారు డ్రైవ్ చేస్తున్నాడు. అంతవరకు సుధాకర్ చెప్పే విషయాలన్నీ ఆసక్తిగా విన్న ఆనందరావు అలా అడిగాడు. డోర్‌లోంచి, బయట పరుగెడుతున్న ప్రకృతిని తిలకిస్తున్న సుధాకర్ తలతిప్పి ఆనందరావువైపు తిరిగాడు. తర్వాత చిన్నగా మందహాసం చేస్తూ అన్నాడు "ఏం రావ్! నేనెందుకామెను మ్యారేజ్ చేసుకోకూడదు? శారద అందమైనది, చదువుకున్నది కూడా!!"

"అయితేమాత్రం? ఆమె పేదరాలని మీరే చెప్పారు కదసార్! మీ అంతస్థెక్కడ? ఆ అమ్మాయి అంతస్థెక్కడ చెప్పండి!"

"నాకు కావాల్సింది అంతస్తు కాదు రావ్!" సుధాకర్ గంభీరంగా మారిపోతూ అన్నాడు "జీవితం పరిపూర్ణత చెందడానికి కావల్సినవి ఆస్తులు, అంతస్తులు కావు. సహృదయం, ఎదుటి మనిషికి ఊరట కల్గించే స్నేహశీలం."

"ప్రపంచంలో కట్టుకున్న ప్రతి భార్యా, తన భర్తకు నిర్మలమైన స్నేహితాన్ని పంచి ఇస్తుందని చెప్పలేను గాని నూటికి తొంబయి శాతం అన్యోన్యతా - అనురాగాలు కలి వుంటారని నా అభిప్రాయం, సార్! అందుకని ......" ఆగిపోయాడు.

"ఊఁ! అందుకని ఏం చేయమంటావో చెప్పు రావ్?"

"అందుకని మీ హోదాకు తగిన యోగ్యురాల్ని మీరు పెళ్ళి చేసుకోండి సార్!"

సెక్రటరీ పల్కిన మాటలకు చిన్నగా నవ్వాకు సుధాకర్ "చూడు రావ్! చిన్ననాటనుంచీ నేనెలా పుట్టి పెరిగానో నీకు తెలుసా?"

తెలియదన్నట్టుగా తలాండించాడు ఆనందరావు.

"అయితే విను! నా చిన్నతనంలో నేనెలా పెరిగానో వింటే నువ్వు అమితంగా ఆశ్చర్యపోతావు. ఎంతటి నిరుపేద కుటుంబంలో జన్మించిన పిల్లవాడైనా నా అంత నికృష్టంగా పెరిగియుండడు.

"పిల్లల్ని కన్నంతమాత్రాన్నే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదు రావ్! వార్ని సక్రమంగా సాకి పెద్ద చేసి ప్రయోజకుల్ని చేయాలి. అతను జీవితాన్ని ఈ ప్రపంచము నేబాధల పుట్టలోంచి నెట్టుకోగల్గినంత అర్హతగలవాడుగా తయారు చెయ్యాలి.

"నేను మా అమ్మా నాన్నలకు వివాహానికి పూర్వమే జన్మించిన అభాగ్యుణ్ని. నేను పుట్టింతర్వాత నన్ను తమ బిడ్డడని లోకానికి చాటేంత గుండె దిటవు మా అమ్మా నాన్నలకు లేకపోయింది' అందుకని నన్నో అనాథాశ్రమంలో చేర్పించారు. ఆతర్వాత కొద్దిరోజులకే నా తల్లిదండ్రులు నిజజీవితంలో భార్యాభర్తలయారు.

మా నాన్న పేరు వెంకటేశ్వరరావు. ఆయన మా అమ్మను అతి ప్రేమగా చూసుకునేవాడు. వారిద్దరూ పరస్పరం అనురాగాణ్ని పంచుకుంటూ జీవించారు. కాని పెళ్ళయింతర్వాత చాలా కాలమైనా మా అమ్మకడుపున ఒక్క నలుసైనా జన్మించలేదు. అనాథాశ్రమంలో పెరుగుతున్న నన్ను తీసుకురమ్మని అమ్మ ప్రతి నిత్యమూ నాన్నను బ్రతిమిలాడేదట.

ఈలోగా అనాథాశ్రమంలో పెరుగుతున్న నాకు పది సంవత్సరాల ఈడు వచ్చింది. నేనొక రోజు బాహ్య ప్రపంచాన్ని చూడాలనే తపనలో ఆశ్రమంలోంచి దొంగచాటుగా పారిపోయాను. కాని బయటపడిన మరుక్షణంనుంచీ ఏకాకినైపోయాను. పడరాని బాధలు పడ్డాను. కడుపు నిండడానికి చాలాచోట్ల చిన్న చిన్న పనులు చేశాను. ఒకపని అనే నియమం లేకుండా నాకు చేతనైన ప్రతి పనీ నేను చేశాను. ఆ లేత వయస్సులో ఎంతపని అని చేయగలను?

ఒక్కో పర్యాయం తినడానికి తిండిలేక మండుతున్న కడుపులోనే ఎక్కడో ఒకచోట పడి నిద్ర పోతూ వాడిని.

చివరికి నేను భరించలేకపోయాను. అన్నం దొరక్క పోయినా ఫరవాలేదు, కొన్ని దినాలు మాడుతూ వుండగలను. కాని నా లేతహృదయం మమతకోసం పరితపించింది. అనాథాశ్రమంలో నన్ను ప్రేమతో చూచే ఆయా గుర్తుకు వచ్చింది.

ఇక నేను నిలవలేక పోయాను. తిరిగి ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ నాకోసం ఆయా చాలా రోజులుగా ఎదురుచూసి వేసారిపోయిందట. నేను కనిపించగానే ఎంతో సంతోషంతో "బాబూ!" అంటూ నన్ను తన హృదయానికి హత్తుకుంది. ఆతర్వాత కొద్దిరోజులపాటు ఆయా ఆలనా పాలనలో హాయిగా వున్నాను.

ఒక రోజు! ఎవరో ధనవంతురాలైన ముసలావిడ కారులో నేనున్న ఆశ్రమానికి వచ్చింది. ఆవిడ ఆయాతో ఏమో మాట్లాడి నేను ఏడుస్తూన్నా లక్ష్య పెట్టకుండా నన్ను తన కారులో ఎక్కించుకొని తీసుకుపోయింది. వెనకాల ఆయా దుఃఖంతో కళ్ళనుండి స్రవిస్తున్న అశ్రువులను వత్తుకుంటూ వుండిపోయింది.

ఆ ముసలావిడ మా నాయనమ్మ అని తర్వాత తెల్సింది నాకు. ఆమె ఒక్కగానొక్క కుమారుడే మా నాన్న వెంకటేశ్వరరావు.

కారు యాక్సిడెంట్‌లో మా అమ్మ చనిపోయినప్పట్నించి మా నాన్నగారు పిచ్చివారయ్యారట. అస్తమానం తాగుతూ బాహ్యప్రపంచానికి సంబంధం లేకుండా వుండేవాడు. ఒకసారి నిషాలో వున్నప్పుడు ఆయన నా గురించి చెబుతూ నా జన్మరహస్యాన్ని వెల్లడి చేశాడట. ఆ మాటలు విన్న నాయనమ్మ నన్ను వెంటనే ఇంటికి తెచ్చుకుంది.

నాయనమ్మ చాలా దర్పంగల మనిషి. డబ్బు తెచ్చిన హోదా ఆమెలో చాలా వుంది. ఎప్పుడూ బిజినెస్ వ్యవహారాలు తప్ప ఇతర విషయాలేవీ పట్టించుకునేది కాదు. విశాలమైన ఆ భవనపు బంధిఖానాలో నన్ను కట్టిపడేసింది. నా ఆలనా పాలనా అంతా నౌకర్లకే వదిలేసింది. వేళకు వంటమనిషి పిలిచి వడ్డిస్తే వెళ్ళి తినేవాడిని. నాన్నగారు ఈ లోకంలోనే వుండేవారు కాదు. ఎప్పుడూ తాగుతూ ఇంటిపట్టున వుండకుండా తిరిగేవాడు.

"నేనెప్పుడైనా నా తోటి పిల్లలతో ఆడుకుంటే నౌకర్లు వారించి ఇంట్లోకి లాక్కువచ్చేవారు. అలా చేస్తే అమ్మగార్కి చెబుదామని బెదిరించేవారు. ఒకవేళ నేనెప్పుడైనా నాయనమ్మను చూద్దామనుకున్నా వీలుండేదికాదు. ఒక్కోసారి వారం రోజులైనా ఆమె నాకు కనిపించేదికాదు.

"ఆలాంటి వాతావరణంలో యాంత్రికంగా పెరిగి పెద్దవాడయ్యాను నేను. రోజులు దొర్లిపోయాయ్. నాయనమ్మ పోవడంతో చదువు అసంపూర్తిలో వదిలేసి బిజినెస్ వ్యవహారాలన్నీ స్వయంగా చూసుకోవడం ప్రారంభించాను.

"అప్పటికే నాకు ఇరవై రెండు సంవత్సరాలు దాటాయ్. ఎన్నో సార్లు నాన్నగార్ని త్రాగుడు మాన్పించి మంచివాణ్ని చెయ్యాలని చూశాను. కాని లాభం లేకపోయింది. ఆయన్ని మార్చటం నావల్ల కాలేదు.

అమ్మను గూర్చిన వేదనతో ఆయన కృంగి కృశించి పోయారు. చివరకు ఒకరోజు నాన్నగారు కూడా హఠాత్తుగా గుండెపోటుతో ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయారు. ఆయన లేమితో నేను దిక్కులేని పక్షి నయ్యాను. ఈ ప్రపంచంలో నా అనేవారు లేక, చివరకు ఒక మంచి మిత్రుడైనా లేక ఒంటరిగా జీవితాన్ని నెట్టుకొచ్చాను. ఆ తర్వాత నేను దృష్టినంతా వ్యాపారంమీద కేంద్రీకరించాను. నా కాయకష్టాలా ప్రయత్నించి, కృషిసల్ప త్వరలోనే బిజినెస్‌ను రెండింతలు చేశాను

"నాకిప్పుడు చేతినిండా డబ్బుంది. ఏది కావాలంటే దాన్ని సునాయాసంగా పొందగలను. స్వర్గసుఖాలనుభవిస్తున్నా నా హృదయం ఆనందంగా లేదు రావ్! ప్రతి నిముషం స్నేహాన్ని, నిండు ప్రేమను కురిపిస్తూ, ఆపదను సంపదను పంచుకుంటూ ఈ ప్రపంచంలో నాతో తోడుగా నీడగా నిల్చే అమృత హృదయం నాకు కావాలి.

"ఎటువంటి మనిషిలోని ఆవేదన నంతా ఒక్క చిరునవ్వుతో త్రోసి పారెయ్యగల్గే స్నేహితత్వం కావాలి. అవన్నీ మూర్తీభవించివున్న శారద నాకు తోడుకావాలి. శారదలో అంతటి దైవత్వం వుంది. ఆమె నీడలో నా వేదిత హృదయం హాయిగా ఊపిరి పీల్చుకోగల్గుతుంది.

"శారదను నేను గాఢంగా ప్రేమించాను. ఆమెను సహచరిణిగా పొందలేకపోతే నేను జీవించలేను. శారద కూడా ఇందుకు అంగీకరించింది. అటువంటి శారద ఇప్పుడు ఏకాకి అయింది. అనురాగాన్ని చిందించే ఆమె తండ్రి ఒంటరిదాణ్ని చేసిపోయాడు".

గంభీరంగా, ఉద్వేగంగా రకరకాలుగా గతాన్ని కళ్ళకు కట్టినట్టుగా చెప్పుకొస్తున్న సుధాకర్ చటుక్కున వంగి ఆనందరావ్ కళ్ళలోకి సూటిగా చూశాడు. "ఇప్పుడు చెప్పు రావ్! ఒక విధంగా నేను, శారద

ఇద్దరం ఒంటరివాళ్ళం. మేమిద్దరం ఐక్యం కావడం అనుచితమంటావా?"

ఆనందరావు కొద్దిసేపు జవాబు చెప్పలేకపోయాడు. అతని కళ్ళలో కూడా చురుకైన భావమేదో కదలాడింది.

"సారీ సార్! అనాలోచితంగా మీ గతాన్ని త్రవ్వి మిమ్మల్ని వ్యథపర్చిన వాణ్ణయ్యాను. మీరు శారదను తప్పకుండా పెళ్ళి చేసుకోవాలిసార్! ఈ విషయం నాకెంతో సంతోషాన్ని కల్గిస్తోంది."

సుధాకర్ ఫ్రీగా నవ్వి సెక్రటరీ భుజం తట్టాడు.

"థాంక్యూ రావ్! నువ్వు నా ముఖ్యమైన స్నేహితుడివి, ఇక మా పెళ్ళి పెద్దవి కూడా నువ్వే! ఏమంటావ్?"

ఆనందరావు వదనం ఆనందంతో ప్రఫుల్లమైంది "అంతకంటేనా సార్! నా మీద మీకున్న అభిమానానికి కృతజ్ఞుణ్ని."

• • •

అంతవరకు చెప్పుకొచ్చిన సుధాకర్ రెండు క్షణాలాగి పద్మవైపు తేరిపార జూశాడు. ఆమె ఆసక్తితో వింటూంది.

చుట్టూ చీకట్లు కమ్ముకుంటున్నాయ్. ఇంచుమించుగా అందరూ వెళ్ళిపోయి బీచ్ ప్రశాంతంగా వుంది. మసక చీకటిలో సముద్రం గంభీరంగా అగుపిస్తూంది.

"చీకటి పడుతోంది ఇక వెళదామా పద్మా!" అప్పటికి అపుదామన్న ప్రయత్నంతో అన్నాడు సుధాకర్.

"ఊహుఁ! తర్వాత వెళదాం!! ముందు మీ కథ పూర్తిగా చెప్పండి" పట్టుదలలో అంది పద్మ.

చిన్నగా నవ్వాడు సుధాకర్. యధాలాపంగా రెండు గుప్పిట్లోకి యిసుక నిండుగా తీసికొని క్రిందకు మెల్లగా వదులుతూ తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"ఆ తర్వాత మా కారు శారదా వాళ్ళ గ్రామం చేరుకుంది. నేను వెళ్ళగానే శారద దర్శించే మేఘమైంది. మెల్లగా ఆమె నోదార్చి నాతో తీసుకువచ్చాను. మేమిదివరకే ప్రేమించుకున్నాము కాబట్టి శారద నాతో రావడానికి కట్టి అభ్యంతరమూ తెలుపలేదు.

ఇక్కడకు వచ్చిన తర్వాత మేమిద్దరం శాస్త్రోక్తంగా దంపతులమయ్యాం. నా ప్రేమదేవత శారద గృహిణిగా మారింది. ఆ తర్వాత జీవితంమీద అల్లుకున్న కలలన్నీ నిజరూపం దాల్చాయ్.

ప్రపంచంలోని ఆనందాన్నంతా మేమే పంచేసుకొని తరిసరాతెరుగని అనురాగాలహరిలో మునిగి తేలాము.

రెండు సంవత్సరాలు నేను హృదయంనిండా ఆనందం నింపుకొని బ్రతికాను. ప్రపంచమంతా ఆనందమయంగా అనిపించింది నాకు. చిన్నప్పట్నించీ ఏ మమత కోసం నేను అలమటించానో, ఏ అనురాగం కోసం పరితపించానో అది శారద రూపంలో నాకు లభ్యమైంది.

"కాని పద్మా!" చెప్పుకొస్తున్న సుధాకర్ కంఠం ఒక్కసారిగా విషాదాన్ని నింపుకుంది.

(సశేషం)

---

# కథాంజలి

[కథల మాసపత్రిక]

స్థాపితం : 1938

విడి ప్రతి...0-40 పైసలు,

సం॥ చందా : రూ. 7-50

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్

బుక్‌స్టాల్సులోనూ దొరుకును.

Edited and Published by A N. Raghavachar, No. 6-B, Murugesamudali Street, Madras-600001
Printed by G. Kulasekaram at Giridhar art Printers 17&19, Badrian Street, Madras-600001.